ఘనంగా వారాహీ నవరాత్రోత్సవాలు



చేర్యాల, జూలై 15: చేర్యాలలోని దుర్గమ్మ ఆలయంలో వారాహీమాత నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారిని శాకంబరిగా విశేషపూజలు జరిపారు. రకరకాల కూరగాయల మాలలు అలంకరించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

కూలీల కొరత.. రైతుల కలత

- పెరిగిన కూలి రేట్లు..అయినా సకాలంలో దొరకని కూలీలు
- పంట చేలలో పెరిగిపోతున్న కలుపు
- అన్నదాతలకు తప్పని తిప్పలు

అక్కన్నపేట, జూలై 15: ఈ వ్యవసాయ సీజన్‌లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు అంతంత మాత్రమే ఉండడంతో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న మొక్కలను కాపాడేందుకు నానా తంటాలు పడుతున్నారు. చేలల్లో కలుపు మొక్కలు అధికమవడంతో వాటిని తీసేందుకు కూలీలు దొరకడం లేదు. దీంతో కొందరు రైతులు పత్తి, మొక్కజొన్న పంట సాళ్ల మధ్యలోనే దుక్కిదున్నుతున్నారు. మరికొందరు గడ్డి మందులు పిచికారి చేస్తున్నారు. కలుపు మొక్కలను సకాలంలో తీయకపోతే మొక్కల ఎదుగుదల సరిగా ఉండదు. ఎరువుల సారం మొత్తం కలుపు మొక్కలే పీల్చుకుంటాయి. గతంలో కలుపు నివారణకు గ్లైఫోసెట్ మందును విచ్చలవిడిగా పిచికారీ చేసేవారు. ఈ మందు పిచికారీ చేయడం వల్ల జీవవైవిధ్యం దెబ్బతినడంతో పాటు క్యాన్సర్‌కు దారితీస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్లైపోసెట్‌ను నిషేధించాయి. ప్రస్తుతం పంటచేలల్లో కలుపు తీసేందుకు కూలీలు రూ.250 నుంచి రూ.350, వరినాటు వేసేందుకు రూ.500 నుంచి రూ.600 వరకు డిమాండ్ చేస్తున్నారు. కూలీలను తరలించేందుకు రవాణా సౌకర్యం కూడా కల్పించాలని షరతులు పెడుతున్నారు. రైతులపై ఆర్థిక భారం పెరుగుతుండడం, స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో ఇతరప్రాంతాలకు చెందిన కూలీలను తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. 3 లక్షల ఎకరాల్లో వరి, 1.80 లక్షల ఎకరాల్లో పత్తి, 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 10 వేల ఎకరాల్లో కంది పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, మద్దూర్ మండలాల్లో సుమారు 20వేల ఎకరాల్లో పత్తి, 2వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు.

కూలీలు దొరకడం లేదు

రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. చేనులో గడ్డి బాగా పెరిగింది. కలుపు తీసేందుకు కూలీలు దొరకడం లేదు. చివరికి గడ్డి మందు తీసుకొచ్చి పిచికారీ చేశాను. గడ్డి చనిపోవడంతో ఎద్దులతో చేనులో గుంటుక కొడుతున్నాం.

- పొన్న కరుణాకర్, రైతు, అక్కన్నపేట మండలం



అక్కన్నపేట మండలం రామవరంలో పత్తి చేనులో పెరిగిన కలుపు

రింగ్‌రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో?

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు పనులు మూలకు పడ్డట్లే కనిపిస్తుంది. గత ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా, ఆర్భాటంగా నిర్మాణం చేపట్టిన రింగ్ రోడ్డు పనులు రెండుచోట్లా నిలిచిపోయాయి. దీంతో ఎటువైపు కనెక్టివిటీ లేక వాహనాలు గజ్వేల్ పట్టణంలో నుంచే వెళ్తున్నాయి. ఫలితంగా తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

- ముందుకు సాగని పనులు
- పట్టింపులేని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ తిప్పలు
- ప్రస్తుత రింగ్‌రోడ్డుపై జారుతున్న తారు
- ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు దాదాపు లేనట్లే?



గజ్వేల్ పట్టణంలోని జాలిగామ వద్ద నిలిచిన రింగ్ రోడ్డు పనులు

గజ్వేల్, జూలై 15: ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం గజ్వేల్ పర్యటనలో రింగ్‌రోడ్డును ప్రకటించారు. రూ.264 కోట్లతో 2016లో చేపట్టిన 21.92 కిలోమీటర్ల గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు నిర్మాణం కిలోమీటరున్నర నిలిచిపోయింది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు నాలుగు లేన్లుగా నిర్మిస్తే, రింగ్‌రోడ్డుకు తూర్పు భాగంలో రాజీవ్ రహదారికి బైపాస్‌గా ప్రత్యేకంగా 6.4 కిలోమీటర్ల మేర ఆరులేన్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి కరీంనగర్, కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు నేరుగా మూడు ఫ్లైఓవర్ల మీదుగా వెళ్తున్నాయి. తొమ్మిది జంక్షన్లు, మూడు ఫ్లైఓవర్లతో సర్కిళ్లను అద్భుతంగా సుందరీకరించారు. అయితే, మధ్యలో రెండు చోట్ల నిలిచిపోయిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిపోయింది.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు

రెండు చోట్ల నిలిచిన పనులు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు రెండు చోట్ల పెండింగ్‌లో పడింది. గజ్వేల్ రైల్వే స్టేషన్ వద్ద దాదాపుగా కిలోమీటర్‌కు పైగా రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉండగా, సంగాపూర్ రోడ్డులోని సిటిజన్స్ క్లబ్(పాత ఆర్డీవో కార్యాలయం) వద్ద వంద మీటర్ల రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో పడింది. దీంతో అటు చేగుంట మీదుగా గజ్వేల్ వచ్చే వాహనాలు, ఇటు తూప్రాన్ మీదుగా గజ్వేల్ వచ్చే వాహనాలు గజ్వేల్ పట్టణంలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గజ్వేల్ రింగ్‌రోడ్డుకు రెండు వైపులా కనెక్టివిటీ లేకుండా పోవడంతో దాదాపుగా 20 కిలోమీటర్ల మేర రింగ్ రోడ్డు నిర్మించినా వృథాగానే మిగిలిపోయింది.

పూర్తయితేనే ట్రాఫిక్ సమస్యలకు చెక్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితేనే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడే అవకాశాలున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో పాఠశాలల, కళాశాలల బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్‌తో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రింగు రోడ్డు పూర్తయితే లారీలు, ట్రాన్స్‌పోర్టు వాహనాలు బయటనుంచే వెళ్తాయి. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ రోడ్లపై ట్రాఫిక్ తగ్గడంతో పాటు వ్యాపార, వర్తక యజమానులకు ఇబ్బందులు తప్పుతాయి. ఈ నేపథ్యంలో రింగ్ రోడ్డు పూర్తి చేయడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది.

ఇప్పట్లో కష్టమేనా?

పదేళ్ల ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గ కేంద్రంలోనే పనులు ముందుకు సాగడం లేదు. ఇక ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండడంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని ప్రజలు భావిస్తున్నారు. ఇక రింగ్‌రోడ్డుపై వేసిన తారు సైతం కొట్టుకపోతుండడం, కిలోమీటరున్నర మేర రింగ్ రోడ్డు పెండింగ్‌లో ఉండడం, ఆర్డీవో కార్యాలయం వద్ద వంద మీటర్ల రింగ్‌రోడ్డుకు సంబంధించిన అంశం పెండింగ్‌లో ఉండడంతో ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. పైగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం, కేసీఆర్ ఈ రింగ్‌రోడ్డు పనులను ప్రారంభించడంతో తాజా ప్రభుత్వం రింగ్‌రోడ్డు పూర్తి చేయడంపై దృష్టి సారించడం కష్టతరమేనని భావిస్తున్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డులో జగదేవ్‌పూర్ రోడ్డులో లేచిపోయిన తారు

అండర్-17 ఫుట్‌బాల్ పోటీలకు బాలికల ఎంపిక



ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సిద్దిపేట టౌన్, జూలై 15 : సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను సోమవారం పట్టణంలో నిర్వహించారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 74 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ నవాబ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూలై 29 వరకు జరిగే శిక్షణా శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. అందులో ప్రతిభ కనబర్చిన 30 మంది క్రీడాకారులను ఆగస్టు 1న కర్ణాటకలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు.



హరిరామ కీర్తనలు ఆలపిస్తున్న పురోహితులు

భవానీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మర్కుక్, జూలై 15: ఆషాఢ ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పాండురంగ ఆశ్రమంలో సోమవారం భవానీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, శతరుద్రాభిషేకం, పుష్పార్చన, సామూహిక కుంకుమార్చన, నీరాజన సేవ నిర్వహించారు. నల్లకుంట రామాలయం నుంచి వచ్చిన భక్తులు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హరే రామనామ భజన సంకీర్తనలు చేశారు. మంగళవారం నుంచి ఆశ్రమంలో 93వ తిరాత్రోత్సవం ప్రారంభమై మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు పాండురంగ, ఆశ్రమ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అబ్బురపరిచే ఆవిష్కరణలు

- ఐఐటీహెచ్‌లో ఇన్నోవేషన్ డే..
- ప్రారంభించిన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి
- ప్రతిభావంతుల అవకాశాల అన్వేషణకు చక్కని మార్గం
- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

7లో

ఇన్నోవేషన్ డేలో సందడి చేస్తున్న విద్యార్థులు

చెదిరిన గులాబీ

- కాంగ్రెస్ గూటికి గూడెం మహిపాల్‌రెడ్డి
- అదే దారిలో గాలి అనిల్‌కుమార్
- చేరికలపై కాంగ్రెస్ సీనియర్ల అలక
- రసవత్తరంగా పటాన్‌చెరు రాజకీయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 15: ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్' జోరందుకుంది. ఊగిసలాటలో ఉన్న నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీగా పోటీసిన బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో పటాన్‌చెరు రాజకీయం రసవత్తరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు గెలవగా.. అందులో ఒకరు పార్టీ మారారు. జాబితాలో ఇంకెవరున్నారనే ఆసక్తి నెలకొంది.

ఎట్టకేలకు కాంగ్రెస్‌లోకి..

వరుసగా మూడుసార్లు పటాన్‌చెరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మహిపాల్‌రెడ్డికి స్థానికంగా గట్టి పట్టుంది. గడిచిన మూడు దఫాలుగా ఈ నియోజకవర్గంపై ఎంతోమంది బీఆర్ఎస్ నేతలు కన్నేసినప్పటికీ మహిపాల్‌రెడ్డి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. అయితే ఇటీవల తన కుటుంబసభ్యుల వ్యాపారాలపై ఈడీ దాడులు జరిగాయి. దీంతో అభద్రతకు లోనైనట్లుగా తెలుస్తున్నది. అందుకే బీజేపీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగింది. ఆయన ఢిల్లీలో పర్యటించడం పలు అనుమానాలకు తావిచ్చింది. అయితే, ఆయన కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం మూడురోజులుగా ఊపందుకుంది. అనుకున్నట్లుగానే సోమవారం సీఎం సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్ నుంచే ప్రస్థానం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీలోనే ప్రారంభం అయింది. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పటాన్‌చెరు మండలాధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో పటాన్‌చెరు నుంచి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తరువాత కొంతకాలం టీడీపీలో చేరి తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా వ్యవహరించారు. తెలంగాణ ఏర్పాటు తరువాత 2014లో అనూహ్యంగా టీఆర్ఎస్ పటాన్‌చెరు టికెట్ దక్కించుకుని గెలుపొందారు. అలా మూడుసార్లు పటాన్‌చెరు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించారు. బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావుకు దగ్గరి వ్యక్తిగా వ్యవహరించారు.

ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరి..

మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం ఆశించి భంగపడిన గాలి అనిల్‌కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపించనప్పటి నుంచి గాలి అనిల్‌కుమార్ టీఆర్ఎస్‌లో పనిచేశారు. 2014లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. పదేళ్లపాటు ఆయన కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేశారు. 2019లో కాంగ్రెస్ నుంచి టిక్ ఆశించినా.. అక్కడా నిరాశే ఎదురవడంతో గత అసెంబ్లీ ఎన్నికల ముందు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. జహీరాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరఫున బరిలోకి దిగి ఓడిపోయారు.

ప్రత్యర్థులంతా ఒకే గూటిలో..

పటాన్‌చెరులోని రాజకీయ ప్రత్యర్థులంతా ప్రస్తుతం కాంగ్రెస్ గూటికే చేరడం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు టికెట్ కోసం గూడెం మహిపాల్‌రెడ్డితో పోటీపడిన నీలం మధు.. టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారి బీఎస్పీ నుంచి పోటీచేశారు. తదనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరి మెదక్ ఎంపీ టికెట్ దక్కించుకుని స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్.. పలుచోట్ల మాట్లాడుతూ నీలం మధు కారణంగానే తాను ఓడిపోయానని ఆవేదన చెందారు. ప్రస్తుతం తనతో పోటీపడిని ఇద్దరూ కాంగ్రెస్‌లోనే చేరడంతో ఆయన భవిష్యత్తుపై ఆందోళనతో ఉన్నారు. పటాన్‌చెరులో పలు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీపడిన నేతలంతా ప్రస్తుతం కాంగ్రెస్ గూటికే చేరడం గమనార్హం. ఆయా పార్టీల్లో ఉప్పునిప్పులా ఉన్న నేతలంతా ఒకే పార్టీలో ఎలా మసులుకుంటారో వేచిచూడాలి.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

- మొత్తం 66 దరఖాస్తులు
- ప్రజావాణి గొప్ప కార్యక్రమం
- అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 15 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు పోటెత్తాయి. భూ సంబంధిత, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 66 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డితో ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి ప్రజావాణి చక్కని కార్యక్రమమని అందరూ సద్వినియోగం చేసుకోవాలని గరీమా అగ్రవాల్ సూచించారు. అధికారులు ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

కానిస్టేబుల్ నా స్థలాన్ని కబ్జా చేసిండు

- బెల్లె భూమయ్య, దుబ్బాక



దుబ్బాకలోని 13 వార్డులో నా ఇల్లు శిథిలావస్థలో, కొంత మేరకు కూలిపోయి ఉంది. నా ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇల్లును వదిలిపెట్టి వేరే చోట కిరాయికి నివాసం ఉంటున్నాను. నేను లేని సమయంలో సారంపల్లి రమేష్ అనే కానిస్టేబుల్ ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి వచ్చేటట్లుగా ఇంటిని నిర్మిస్తున్నాడు. కుల పెద్దమనుషుల సమక్షంలో పిలిపిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సమాధానం చెబుతున్నాడు. నన్ను నా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించి చర్యలు తీసుకోవాలని, నాకు న్యాయం చేయాలని కుల పెద్దలతో కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశా.

ఆన్‌లైన్‌లో నా భూమి చూపించడం లేదు

- సుద్దమల్ల మల్లమ్మ, తిగుల్ గ్రామం

మాది జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామం. 740/అ సర్వే నంబర్‌లోని 12 గుంటల వ్యవసాయ భూమి ధరణి ఆన్ లైన్‌లో చూపించడం లేదు. 2010-11 వరకు నా భర్త ఇస్తారి పేరు మీద ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి ఆ భూమిని మేము సాగు చేస్తున్నాం. కలెక్టర్ సార్ నాకు న్యాయం చేసి 12 గుంటల వ్యవసాయ భూమి ధరణి ఆన్‌లైన్ చేయాలి.

భూదాన్ భూమిని స్వాధీనం చేసుకోవాలి

- సీపీఎం జిల్లా బృందం



చేర్యాలలో కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భూధాన్ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నాడు. ఆ భూమిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. చేర్యాల రెవెన్యూ శివారులోగల 1030 సర్వే నంబర్‌లో ఏడెకరాల ఒక గుంట భూదాన్ భూమిని రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్లను లోబర్చుకొని అక్రమంగా పట్టా చేయించున్నారు. నిరుపేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూదాన్ భూమిని అక్రమంగా పట్టా చేయించుకుని పేదలను మోసం చేస్తున్నారు. అక్రమంగా పట్టా చేయించుకున్న భూదాన్ భూమి పట్టాలను వెంటనే రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.

అమ్మకానికి ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

ఆగస్టు 14న బహిరంగ వేలం



కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెరకర్మాగారం

జహీరాబాద్, జూలై 15: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం అమ్మకానికి సిద్ధమైంది. ఈ మేరకు అవసరమైన ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఆర్ ఆర్ యాక్ట్‌లో భాగంగా ఆగస్టు 14న ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని బహిరంగ వేలం వేస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ రవీందర్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో స్థానిక చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి నాలుగు, ఐదు ఏళ్లుగా ఈ కార్మాగారం నిర్వహణ అంతంత మాత్రంగానే సాగుతోంది. 2022-23లో చెరకు క్రషింగ్ జరిగినా, రైతులకు డబ్బు ఇవ్వకపోవడంతో అధికారులు, నాయకులు జోక్యం చేసుకుని రూ.80 కోట్ల మేర బిల్లులు ఇప్పించారు. 2023-24లో క్రషింగ్ జరగలేదు. 1970లో చెరకు రైతుల సౌకర్యార్థం రోజుకు 1500 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో నిజాం చక్కెర కర్మాగారాన్ని దివంగత నేత స్వర్గీయ బాగారెడ్డి కృషితో ఏర్పాటైంది. తొలి రోజుల్లో రైతు 5 వేల ఎకరాల్లో చెరవు సాగు చేశారు. ప్రస్తుతం సాగు 25 వేల ఎకరాలకు విస్తరించింది. ప్రభుత్వ భాగస్వామ్యంతో నిజాం షుగర్స్ పేరిట నడిచిన ఈ కార్మగారాన్ని చంద్రబాబు హయాంలో ప్రైవేట్ వారికి విక్రయించారు. వారు 2022-23 వరకు క్రషింగ్ చేశారు. తర్వాత కర్మాగారం మూత పడింది. అయితే, కర్మాగార యాజమాన్యం మొత్తం రూ. 30 కోట్లు అప్పు పడినట్లు తెలుస్తున్నది. అందులో ఐదున్నర కోట్లు కార్మికుల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, రూ.7 లక్షలు రైతులకు చెరకు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. అలాగే, కర్మాగారాన్ని మార్టిగేజ్ చేసి రూ. 24 కోట్లు అప్పు తీసుకున్నారు. ఈ అప్పులు తీర్చకపోవడంతో ఆర్ఆర్ యాక్ట్ కింద కర్మాగారాన్ని వేలం వేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదించాలని తహసీల్దార్ కోరారు.



తహసీల్దార్ జారీ చేసిన చేసిన వేలం ప్రకటన

రూ.34.94 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్ల పట్టివేత

డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడమే లక్ష్యం : ఎస్పీ చెన్నూరి రూపేష్

మునిపల్లి, జూలై 15 : కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న రూ.34.94 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు సోమవారం సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. మునిపల్లి మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌లో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌తో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌లోని కాటేదాన్‌కు టీఎస్ 01యూఏ 5009 డీసీఎంలో అక్రమంగా గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్నారని పక్కా సమాచారంతో సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ ప్లాజా వద్ద ఏఎస్ఐ ఏసయ్య తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. 60 బ్యాగుల్లో రూ.34,94,400 విలువ చేసే 58,240 పోచెస్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులైన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన షేక్ షబ్బీర్ అహ్మద్, తన్‌సిఫ్‌లను అరెస్టు చేశామని, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన అర్బత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టి డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడమే లక్ష్యమని ఎస్పీ రూపేష్ తెలిపారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందాలను ఏర్పాటు చేసి విస్తృ దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుట్కా, గంజాయి విక్రయాలపై నిషేధం ఉందని, అమ్మినా.. కొన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుట్కా, గంజాయి విక్రయిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కార్యాలయంలో 8712656777కు సమాచారం అందిస్తే వారికి పారితోషికం అందించి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ సత్తయ్యగౌడ్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, సీసీఎస్ సీఐ మల్లేశం, ఎస్ఐలు రాజేష్ నాయక్, శ్రీకాంత్, ఏఎస్ఐ ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.




కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్పీ రూపేష్

సత్ప్రవర్తనతో మెలగాలి

సంగారెడ్డి క్రైం, జూలై 15 : నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పాత నేరస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలిగితే హిస్టరీ షీట్ నుంచి తొలగిస్తామని తెలిపారు. జిల్లాలో గంజాయి పండించినా, అక్రమ రవాణా చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలవాటు పడిన నేరస్థులపై పీడీ యాక్టు నమోదు చేసి హిస్టరీ షీట్స్ తెరుస్తామన్నారు. నూతనంగా వచ్చిన చట్టం ప్రకారం కఠిన చర్యలున్నాయని, ఇద్దరు, ముగ్గురు కలిసి నేరం చేసినట్లయితే ఆర్గనైజ్డ్ క్రైంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులతో ఫ్రెండ్లీగా ఉండాలని, జిల్లాలో జరుగుతున్న అక్రమాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

పప్పన్నమే.. కూర లేదు..!

నిత్యం ఒకే రకం ఆహారంతో విద్యార్థుల ఇబ్బందులు



పాఠశాలలో పెట్టిన పప్పు, అన్నం

కౌడిపల్లి, జూలై 15 మండల పరిధిలోని సలావత్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10 వతరగతి వరకు 123 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలకు మధ్యాహ్నం భోజనం అక్షయపాత్ర నుంచి వస్తుంది. ప్రతీ రోజు ఒకే రకం పప్పు తీసుకురావడంతో విద్యార్థులు తినేందుకు ఇష్టపడడం లేదు. పప్పు నాణ్యత లేకుండా వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా పప్పన్నం తినలేకపోతున్నామని పేర్కొన్నారు. వారంలో ఒకరోజైన కూరగాయ తీసుకురావాలని కోరుతున్నారు.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన లారీ

జగదేవ్‌పూర్, జూలై 15: లారీలో తరలిస్తున్న 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జగదేవ్‌పూర్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ చంద్ర మోహన్ తెలిపిన వివరా ప్రకారం.. జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బుద్ధ రాములు, గుర్రం రాములు ఇద్దరు కలిసి అనుమతి లేకుండా రేషన్‌బియ్యంను హైదరాబాద్‌కు రవాణా చేస్తుండగా నమ్మదగ్గ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. 80 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వన మహోత్సవంలో
భాగస్వామ్యం కావాలి

- జిల్లా వ్యాప్తంగా 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఇంటింటికీ మొక్కల పంపిణీ : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటిన కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 15 : ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా ప్రజలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో 15 లక్షల మొక్కలు నాటారని, మిగిలిన మొక్కల నాటే కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల, ఇరిగేషన్, అటవీ భూముల్లో అనువైన స్థలాను గుర్తించి మొక్కలను నాటుతామన్నారు. నాటడమే కాకుండా, పరిక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి రవికుమార్, డీఆర్డీఏ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో ఆర్టీసీ, విద్య, డీఆర్డీవో, ఆరోగ్య, పంచాయతీ, వ్యవసాయ, పౌరసరఫరా, అటవీ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల పనితీరును శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణం, ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యాలు, డిపోలలో పరిశుభ్ర కార్యక్రమాలు, మహిళల స్వయం సహాయక గ్రూపులకు అందించే సహాయ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. వ్యవసాయ స్థితిగతులు, వర్షాభావ పరిస్థితులు, రైతు భరోసా, ఎరువులు, విత్తనాలు విద్యుత్, రేషన్ బియ్యం, గ్యాస్ సరఫరా, జిల్లాలో నాటే మొక్కల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, రాధాకిషన్ గోవిందు, బ్రహ్మారావు, రవికుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులో
సూక్ష్మరాతి పనిముట్లు లభ్యం

క్రీస్తుపూర్వం 8వేల సంవత్సరాల కాలం నాటివిగా గుర్తింపు



నంగునూరు జోకిరమ్మ బండపై లభ్యమైన సూక్ష్మరాతి పనిముటు

నంగునూరు, జూలై 15 : సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామానికి దక్షిణం వైపున ఉన్న జోకిరమ్మ బండ మీద సూక్ష్మరాతి పరికరాలు (మైక్రోలిథిక్ టూల్స్) లభ్యమైనట్లు ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. కొంతకాలంగా గ్రామంలో పరిశోధనలు చేస్తున్న ఆయన కొత్త రాతి యుగం నాటి రాతి గొడ్డళ్లు, శాతవాహనుల కాలం నాటి టెర్రకోట బొమ్మలు, పూసలు, దేవత విగ్రహాలను గుర్తించారు. ఈసారి సూక్ష్మ రాతి పనిముట్లను గుర్తించినట్లు తెలిపారు. ఇవి చిన్న రాతి పనిముట్లు అని, ఇందులో కొన్ని ఒక సెంటీమీటర్ పొడవు ఉండగా మరికొన్ని అంతకంటే చిన్నవిగా ఉన్నాయన్నారు. వీటిలో బ్లేడు, బాణం మూలికి లాంటి పరికరాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. క్వార్ట్, చెర్ట్ చాల్కోడ్, జాస్పర్, చెకుముకి వంటి రాళ్లతో ఇవి తయారు చేశారని, వీటి వయస్సు క్రీస్తుపూర్వం 8000 సంవత్సరాల కాలానికి చెందినవని, వీటిని బట్టి కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఈ బండ మానవ ఆవాసంగా ఉండేదని శ్రీనివాస్ పేర్కొన్నారు.

రేబర్తిలో ఆయిల్‌పామ్ కోతలు ప్రారంభం



గెలలను చూపెడుతున్న ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్

మద్దూరు, జూలై 15 : మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో రైతు నలుసాని లింగారెడ్డి సాగు చేసిన ఆయిల్ పామ్ తోట కోతకు రావడంతో సోమవారం ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్ గెలల కోతల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లింగారెడ్డి తన వ్యవసాయ భూమిలో 12 ఎకరాల్లో పామాయిల్‌ను సాగు చేసినట్లు తెలిపారు. 6 ఎకరాల్లో గెలలు కోతకు రావడంతో కోతలు ప్రారంభించగా సోమవారం ఒక ఎకరంలో గెలలను కోసినట్లు తెలిపారు. మరో నాలుగు రోజులు కోతలుంటాయని తెలిపారు. కోసిన గెలలకు ప్రతీ మండలానికి కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి ఫ్యాక్టరీకి తరలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డు అసిస్టెంట్ రాకేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

పిరమల్ ఫార్మా పరిశ్రమలో
సీఐటీయూ ఘన విజయం



విజయోత్సవంలో సీఐటీయూ నాయకులు

కోహీర్, జూలై 15 : మండల పరిధి దిగ్వాల్‌లోని పిరమల్ ఫార్మా పరిశ్రమలో సోమవారం నిర్వహించిన కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ కార్మిక సంఘం విజయం సాధించింది. పరిశ్రమలో 137 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ కార్మిక సంఘం తరఫున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘం తరఫున హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్, ఎస్‌ఐటీయూసీ అనుబంధ సంఘం తరఫున హుగ్గెల్లి రాములు బరిలో నిలుచున్నారు. సీఐటీయూ కార్మిక సంఘానికి 68 ఓట్లు రాగా, హెచ్‌ఎంఎస్‌కు 53 ఓట్లు వచ్చాయి. ఎస్‌ఐటీయూసీ కేవలం 15 ఓట్లతో సరిపెట్టుకున్నది. 15 ఓట్ల మెజార్టీతో సీఐటీయూ కార్మిక సంఘం విజయం సాధించడంతో నాయకులు పరిశ్రమ వద్ద విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ తనకు విజయాన్ని అందించిన పరిశ్రమ కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్మికులకు మంచి వేతన ఒప్పందంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా పనిచేస్తానని పేర్కొన్నారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతీ కార్మికుడికి చుక్కా రాములు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు బి.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచే ఆవిష్కరణలు

ఐఐటీహెచ్‌లో ఇన్నోవేషన్ డే.. ప్రారంభించిన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి



- నూతన స్టార్టప్‌ల సందడి
- ప్రతిభావంతుల అవకాశాల అన్వేషణకు చక్కని మార్గం
- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, జూలై 15 : ఆధునిక సాంకేతికతతో పరిశోధనలు చేపట్టి నూతన ఆవిష్కరణలను ముందుకు తీసుకొచ్చే కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ వేదికైంది. సోమవారం ఇన్వెంటివ్ ఇన్నోవేషన్ ఫెయిర్‌ను ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ 'ఇన్వెంటివ్-2024' వేడుకలో దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కలిగిన ఉన్నత విద్యాసంస్థలు పాల్గొన్నాయి. ఇందులో భాగంగా ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వాతావరణ మార్పు, ఈ-మొబిలిటీ, క్లీన్‌ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణ, పరిశ్రమలు వంటి కీలక అంశాలపై ఆవిష్కరణల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతిభావంతులకు విలువైన అవకాశాలను అన్వేషించడానికి చక్కటి మార్గమని తెలిపారు. ప్రపంచ సవాళ్లను అధిగమించే సాంకేతిక పురోగతిని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా ఈవెంట్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని వివరించారు. ఇన్నోవేషన్ డే ఫెయిర్ నేడు కూడా కొనసాగుతుందన్నారు.



వీధి వ్యాపారులకు త్రీ వీలర్ ఎలక్ట్రికల్ వెహికిల్

వీధి వ్యాపారులకు అనువుగా ఉండే త్రీ వీలర్ ఎలక్ట్రికల్ వెహికిల్‌ను వరంగల్ కాకతీయ ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేశారు. ఈ వాహనం ఉంటే షాప్ పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. 500 కేజీల వరకు సరుకులను ఇది మోస్తుంది. 6 గంటలు చార్జింగ్ పెడితే 100 కిలోమీటర్లు ప్రయాణించే ఈ త్రీవీల్ ధర రూ.1.20 వేలు. వచ్చే నెల నుంచి ఇది మార్కెట్‌లో అందుబాటులోకి రానుంది.

రోబోటిక్ అల్ట్రాసౌండ్ సిస్టమ్

ఫైబ్‌సీ స్టార్టప్ కంపెనీ ఐఐటీహెచ్ భాగస్వామ్యంతో రోబోటిక్ అల్ట్రాసౌండ్ సిస్టమ్‌ను రూపొందించింది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేషెంట్లను పట్టణాల్లో ఉన్న డాక్టర్ ఇంటర్నెట్ సహాయంతో స్కాన్ చేయొచ్చు. ఇది ఎక్కువగా ప్రెగ్నెంట్ మహిళల్లో గాల్ బ్లాడర్ స్టోన్స్, కిడ్నీ స్టోన్స్, క్యాన్సర్‌ను గుర్తిస్తుంది. ఈ మెషీన్ ఖరీదు రూ.20 లక్షలు. ప్రత్యేకించి అల్ట్రాసౌండ్ పరీక్ష కోసం రేడియాలజిస్టు ఉండాల్సిన అవసరం ఉండదని పరిశోధకులు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఈ టెక్నాలజీ సాయంతో సాంకేతికపరంగా మరిన్ని అద్భుతాలు చేసి చూపెడతామని పరిశోధకులు చెబుతున్నారు.

యంత్రంతో వరినాట్లు

వరినాట్లు వేసేందుకు కూలీలు దొరకని నేపథ్యంలో మనుషులకు బదులు యంత్రంతో వరినాట్లు వేసేందుకు జపాన్‌కు చెందిన సుజికి ఇన్నోవేషన్ సెంటర్ ఐఐటీహెచ్ భాగస్వామ్యంతో ఓ యంత్రాన్ని తయారుచేసింది. దీని ధర రూ.25 వేలుగా నిర్ణయించారు. దీంతో చిన్నకారు రైతులు స్వయంగా నాట్లు వేసుకోవచ్చు. దీని సహాయంతో ఇద్దరు మనుషులు ఎకరం నాటు నాలుగు గంటలలో వేయొచ్చు.



వ్యర్థాల నుంచి కంకర తయారీ

ఉత్తరప్రదేశ్, బీహర్, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల్లో గత కొంత కాలంగా కంకర కొరత ఏర్పడింది. ఈ ప్రాంతాల వారు కంకర కొనాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. ఈ నేపథ్యంలో బొగ్గు గనులు, థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి సేకరించిన ఇసుక, బూడిదను ఉపయోగించి ఐఐటీహెచ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కంకరను తయారు చేశారు. ఆర్టిఫిషియల్ అగ్రిగెట్స్‌పేరుతో తయారు చేసిన ఈ కంకర అతి తక్కువ ధరలో రోడ్లకు, రైల్వేల ట్రాక్‌లకు వినియోగించేలా కంకర రూపొందించారు. ప్రస్తుతానికి ఇది పరిశోధన దశలోనే ఉందని, త్వరలోనే అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతున్నారు.



మొహర్రం కోసం ముస్లింను
తెచ్చుకున్న గ్రామం

- 60 ఏళ్ల క్రితం ముస్లింను ఆహ్వానించిన గ్రామస్థులు
- రాణాపూర్‌లో ఒక రోజు ఆలస్యంగా..



రాణాపూర్‌లో దూద్‌పీర్‌ను తయారు చేస్తున్న మాసీంసాబ్

నారాయణఖేడ్, జూలై 15 : కులమతాలకు అతీతంగా మొహర్రంను నిర్వహిస్తారు. మొహర్రంలో ఏర్పాటు చేసే పీర్లను తయారు చేయాలంటే ముస్లింలు అవసరం. ఓ గ్రామంలో అసలు ముస్లింలే లేకపోవడంతో దశాబ్దాల క్రితం ఓ కుటుంబాన్ని తీసుకొచ్చారు. ఆ గ్రామమే నారాయణఖేడ్ డివిజన్ పరిధి మనూరు మండలంలోని రాణాపూర్.

గ్రామంలో దాదాపు 250 కుటుంబాలు, 1500 జనాభా ఉండగా వారిలో మరాఠాలు, గౌడ్‌లు, ముదిరాజ్, ఎస్సీ, ఎస్టీలు, పద్మశాలీలు, ఇతర వర్గాల వారు ఉన్నారు. గ్రామం మొత్తంలో ఒక ముస్లిం లేకపోవడంతో పూర్వం మొహర్రంను జరుపుకునే వారు కాదు. తమ గ్రామంలోనూ మొహర్రం నిర్వహించుకోవాలని గ్రామ పెద్దలు దాదాపు 60 సంవత్సరాల క్రితం పుల్‌కూర్తి నుంచి ఒక ముస్లిం కుటుంబాన్ని రాణాపూర్‌కు ఆహ్వానించారు. ఆ కుటుంబ జీవనోపాధి కోసం ఎకరా భూమితో పాటు వసతి కల్పించి, మజీద్‌ను నిర్మింపజేశారు. అప్పటి నుంచి ఆ కుటుంబం వారు తయారు చేసిన దూద్‌పీర్‌తోనే మొహర్రంను నిర్వహిస్తున్నారు. అయితే, ఇక్కడ ఒక రోజు ఆలస్యంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అందరితో పాటే పీర్లను ప్రతిష్ఠించినప్పటికీ చివరి రోజూ కార్యక్రమాన్ని మాత్రం ఒక రోజు ఆలస్యంగా జరుపుతారు. ఆరోజున శ్రమజీవులు పోటాపోటీగా లయబద్ధంగా పాడుతూ మజన ఆడడం విశేషంగా ఆకట్టుకుంటుంది. ముస్లిం కుటుంబానికి చెందిన మాసీంసాబ్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పీర్లను తయారు చేసి ప్రతిష్ఠిస్తున్నారు.

అనాదిగా మా కుటుంబీకులే పీర్లను కడతారు

రాణాపూర్‌లో మొహర్రం సందర్భంగా అనాదిగా మా కుటుంబీకులే పీర్లను తయారుచేస్తారు. గ్రామంలో ముస్లిం లేకపోవడంతో మా కుటుంబీకులను ఆహ్వానించి ఆదరించడంతో ఇప్పటివరకు మేమే పీర్లను తయారు చేసి ఉత్సవం జరుపుతున్నాం.

\- మాసీంసాబ్

పరిహారం.. పేచీ

- సంగారెడ్డి రీచ్‌కెనాల్‌కు భూములిచ్చేందుకు రైతుల విముఖత
- వదులుకునే ప్రసక్తే లేదని పోరుబాట
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రిలే దీక్షలకు దిగిన వైనం

నర్సాపూర్, జూలై 15: సిద్దిపేట జిల్లా కొండపోచమ్మసాగర్ నుంచి కాలువల ద్వారా సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టును నింపేందుకు తలపెట్టిన రీచ్‌కెనాల్ పనులకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. కాలువ మార్గంలో ఉన్న ఆయా గ్రామాల్లోనే చెరువులను సైతం నింపేందుకు ప్రణాళికలు రూపొందించగా భూసేకరణ తలనొప్పిగా మారింది. రూ.కోటి వరకు పలికే భూములను కారుచౌకగా ఇవ్వమంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం విషయంలో పేచీ నెలకొనడంతో రీచ్‌కెనాల్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

సంగారెడ్డి కెనాల్ పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రణాళికలు రూపొందించి సర్వే చేశారు. మెదక్ జిల్లాలో రీచ్‌కెనాల్ కోసం మనోరాబాద్, శివ్వంపేట, నర్సాపూర్ మండలాల పరిధిలో భూమిని సేకరించాల్సి ఉంది. నర్సాపూర్ మండలంలో 491 మంది రైతుల నుంచి 289.04 ఎకరాలు, శివ్వంపేట మండలంలో 836 మంది రైతుల నుంచి 288.17ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి అధికారులు గతంలోనే ఆయా గ్రామాల్లో ఎంత మేర సేకరించాలని గుర్తించారు. ఇటీవల భూసేకరణపై రైతుల అభిప్రాయం తెలుసుకోవడానికి సమావేశాలను నిర్వహించారు. అయితే, భూసేకరణకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఎకరా రూ.కోటి వరకు ఉన్న భూములకు రూ.15 లక్షల నామమాత్రపు పరిహారం ఇస్తుండడంతో మండిపడుతున్నారు. అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడమే కాకుండా ధర్నాలు సైతం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నాలుగు రోజులుగా డివిజన్ కేంద్రమైన నర్సాపూర్‌లో రిలే దీక్షలకు దిగారు. రూ.50 లక్షలపైచిలుకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భూమికి భూమి ఇవ్వాలని అప్పుడు భూసేకరణకు సహకరిస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు భూముల ఇచ్చేందుకు ఒప్పుకునేది లేదంటూ తేల్చిచెబుతున్నారు. నాల్గవ రోజైన సోమవారం చిన్నచింతకుంట రైతులు రిలే దీక్షలో కూర్చున్నారు. ఇప్పటికే రీజినల్ రింగు రోడ్డు కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో పలుచోట్ల ట్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం సర్వేకు వస్తున్న అధికారులను అడ్డుకుంటూ తిప్పి పంపుతున్నారు. తాజాగా సంగారెడ్డి కెనాల్ కోసం భూసేకరణ చేపట్టడంత అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది.



నాల్గో రోజు రిలే దీక్షలో కూర్చున్న చిన్నచింతకుంట రైతులు

సేకరించే భూముల వివరాలు

గ్రామం	రైతులు	విస్తీర్ణం(ఎకరాలలో)
నర్సాపూర్ మండలంలో		
పెద్దచింతకుంట	143	63.03
రెడ్డిపల్లి	16	11.32
చిప్పల్‌తుర్తి	56	44.36
చిన్నచింతకుంట	77	48.04
బ్రాహ్మణపల్లి	106	33.04
లింగాపూర్	93	58.04
శివ్వంపేట మండలంలో		
చెన్నాపూర్	137	29.6
పెద్దగొట్టిముక్ల	159	74.29
సికింద్లాపూర్	131	61.01
లింగోజిగూడ	18	4.16
పిల్లుట్ల	221	81.17
చిన్నగొట్టిముక్ల	105	28.39
తిమ్మాపూర్	65	10.9

ఉన్న భూమి ఇస్తే ఎట్లా బతకాలి



మాకు ఉన్న మూడు ఎకరాలను సంగారెడ్డి కెనాల్ కోసం ఇస్తే మా కుటుంబం ఎట్లా బతకాలి. తరతరాలుగా ఈ భూమిని నమ్ముకుని బతుకుతున్నాం. ఎకరా కోటి వరకు పలికే భూమికి రూ.15లక్షలు కూడా రావు. విలువైన భూములు ఇచ్చి మేము రోడ్డు పాలు కావాలా? భూమికి భూమి లేకపోతే.. ఎకరాలకు రూ.50 లక్షలకుపైగా పరిహారం ఇస్తేనే ఒప్పుకుంటాం.

\- మహేష్‌గౌడ్, చిన్నచింతకుంట

స్పష్టమైన హామీ ఇవ్వాలి



రైతుల అభిప్రాయాలు తీసుకోవడానికి గ్రామసభలు నిర్వహించకుండా సర్వే చేయడానికి అధికారులు రావడం విడ్డూరంగా ఉంది. పరిహారం విషయం తేలిన తర్వాతే భూసేకరణ చేయాలి. వారికి స్పష్టమైన హామీ ఇవ్వాలి. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

\- నాగరాజు, సీపీఎం డివిజన్ కార్యదర్శి

కొత్త స్టోన్ క్రషర్లకు అనుమతులు
ఎలా ఇస్తారు?

ప్రజాభిప్రాయ సేకరణలో ఏర్పాటును వ్యతిరేకించినా వినరా?
మాదారం, రాళ్లకత్వ పరిధిలో కంకర మెషీన్లు, క్వారీలు వద్దని ఆందోళనలు



మండలంలో ఓ స్టోన్ క్రషర్ క్వారీలోని భారీ గుంత

జిన్నారం, జూలై 15: జిన్నారం మండలంలో ఉన్నవి చాలవన్నట్లు కొత్తగా విస్తరిస్తున్న స్టోన్ క్రషర్లు, క్వారీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మాదారం, కాజీపల్లి, రాళ్లకత్వ, సోలక్‌పల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే 13 వరకు స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో కొత్తగా మరో ఆరు క్రషర్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతుండగా స్థానికులు ఆందోళన బాట పట్టారు.



సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న మాదారం జేఏసీ నాయకులు

పేలుళ్ల శబ్దాలు, దుమ్మూధూళితో ఇక్కట్లు

మండలంలోని కాజీపల్లి, మాదారం, రాళ్లకత్వ పరిధిలో ఉన్న స్టోన్‌క్రషర్లతో స్థానికులకే కాకుండా ఇతర గ్రామాల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. క్రషర్ల వద్ద బండరాళ్ల కోసం జరిపే పేలుళ్ల శబ్దాలతో వణికిపోతున్నారు. భారీ పేలుళ్లకు సమీప నివాసాలకు పగుళ్ల ఏర్పడుతున్నాయి. అద్దాలు పగలటం, బోరుమోటార్లు భూమిలో కూరుకుపోవటం, బండరాళ్లు పొలాలు, జలాశయాలలో పడటం జరుగుతున్నాయి. వీటికి తోడు కంకర తయారీలో భారీగా వెలువడుతున్న తెల్లటి రాయి దుమ్ము కిలోమీటర్ల మేర వ్యాపిస్తుంది. ఓవైపు పరిశ్రమల కాలుష్యంతో ఇక్కట్లు పడుతున్న వారికి క్రషర్ల వల్ల కష్టాలు తప్పటం లేదు.


ప్రజాభిప్రాయానికి విలువేది?

మాదారంలో స్టోన్‌క్రషర్ల ఏర్పాటును చాలా మంది వ్యతిరేకించినా అక్కడ కొత్తగా నాలుగు, రాళ్లకత్వలో రెండు క్రషర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇక రాళ్లకత్వలో 2022 ఏప్రిల్ 16న అసలు ప్రజాభిప్రాయ సేకరణే వద్దని గ్రామానికి వచ్చిన అధికారులకు స్థానికులు రోడ్డుపైనే అడ్డుకున్నారు. అధికారులు నామమాత్రంగా కార్యక్రమం నిర్వహించగా ప్రస్తుతం క్రషర్ ఏర్పాటుకు అన్నీ సిద్ధం అవుతున్నాయి. గతంలోనే క్రషర్ల ఏర్పాటు వద్దని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కూడా చేశారు. ఆయా గ్రామాల ప్రజలు, పర్యావరణ వేత్తలు కొత్త స్టోన్ క్రషర్ల ఏర్పాటు వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నా.. ప్రభుత్వం, అధికారులు ఏమీ పట్టనట్లు అనుమతులు ఇవ్వటంతో ప్రజాభిప్రాయాలకు విలువ లేదనే స్పష్టమౌతుంది.

జేఏసీగా ఏర్పడి..

మాదారం పరిధిలో నాలుగు స్టోన్ క్రషర్ క్వారీల ఏర్పాటుకు పనులు చేపట్టారని స్థానికులు ఆందోళన బాట పట్టారు. ఇటీవల గ్రామసభను నిర్వహించి క్రషర్ల ఏర్పాటు, పరిధి విస్తరణ చేయరాదని, కంకర మిషన్ల అనుమతులు రద్దు చేయాలని తీర్మానించారు. అన్నివర్గాలతో కలిసి జేఏసీ కమిటీని ఏర్పాటు చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపట్టారు. మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో క్రషర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో ఫిర్యాదు కూడా చేశారు. కాగా ఇటీవల రాళ్లకత్వవాసులు కూడా తహసీల్దార్‌కు క్రషర్ల ఏర్పాటు వద్దని విన్నవించారు. వారూ సమష్టి పోరాటానికి సన్నద్ధం అవుతున్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం



మాదారం పరిధిలో కొత్తగా స్టోన్ క్రషర్ల ఏర్పాటు, క్వారీలకు అనుమతులపై గ్రామ జేఏసీ ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న క్రషర్లతోనే స్థానికంగా జీవించలేని పరిస్థితులు ఉన్నాయి. మరికొన్నింటికి అనుమతులు ఇవ్వటం దారుణం. నిబంధనలకు వ్యతిరేకంగా రహదారులు, నీటి వనరులు, జనవాసాలకు సమీపంలో క్రషర్ల ఏర్పాటుపై పోరాటం చేస్తాం.

\- విజయ్‌కుమార్‌గౌడ్, జేఏసీ అధ్యక్షుడు


మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి భాస్కర్

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్

కొండపాక, జూలై 15: విద్యార్థి దశ నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్ అన్నారు. కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు లైఫ్ స్కిల్స్ కమ్యూనికేషన్స్ పెంపొందించడం కోసం దేశ్ పాండే స్వచ్ఛంద సంస్థ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించి మాట్లాడారు. పాఠ్యాంశాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవడం అవసరమన్నారు. వాటిని అందివ్వడానికి స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ప్రోగ్రాం ఇంపాక్ట్ డివిజనల్ అధికారి మధు మాట్లాడుతూ జిల్లాలో 40 పాఠశాలలో ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి జి.సంతోష్, దుద్దెడ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దివ్య, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రోడ్డు పనులను పూర్తి చేయాలి'

మిరుదొడ్డి, జూలై 15: అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తిచేయాలని మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్‌రాజులు డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డి మండలం అల్వాల గుడికందుల గ్రామాల మధ్య నిలిచిపోయిన ఆర్అండ్‌బీ రోడ్డు పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులతో కలిసి సిద్దిపేట కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. అల్వాల గ్రామానికి వచ్చే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని, అర్థాంతరంగా నిలిచిన పనులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బాలకిష్టయ్య, హైమ్మద్, కిష్టయ్య, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. 'నిఘా' నిద్ర

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు


పెద్దకోడూరులో కేబుల్ ఊడిపోయిన సీసీ కెమెరా

చిన్నకోడూరు, జూలై 15: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అధ్వానంగా ఉంది. గ్రామాల్లో నిఘా నేత్రాల నిర్వహణ గాడితప్పింది. మరమ్మతులపై ఎవరూ దృష్టిసారించకపోవడంతో సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో గతంలో గ్రామపంచాయతీలు, పోలీసులు, దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు అంతా సవ్యంగా నడిచింది. తర్వాత అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్వహణ గాడితప్పి చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు నేలను చూస్తూ, కేబుల్ ఊడిపోయి, కెమెరా డ్యామేజ్ అయి దర్శనమిస్తున్నాయి. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఏదైనా సంఘటనలు జరిగితే వాటిని ఛేదించడం కష్టంగా మారే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలకు వెంటనే మరమ్మతు పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


మాచాపూర్‌లో మరమ్మతుకు గురైన సీసీ కెమెరాలు



మర్రిముచ్చాల శివారులో డ్రైన్‌పై కప్పు ధ్వంసమై తేలియాడుతున్న ఇనుపచువ్వలు

జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామశివారులో కొద్దిరోజుల క్రితం డ్రైన్ కాలువ పనులు చేపట్టారు. ఓ వాహనం డ్రైన్ కాలువ ఎక్కడంతో పైకప్పు రెండు ప్రదేశాల్లో దెబ్బతిని ఇనుపచువ్వలు తేలియాడుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే పగుళ్లు పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

-చేర్యాల

డంపింగ్‌యార్డులో నాటిన మొక్కలను సంరక్షించాలి

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్/సిద్దిపేట టౌన్/సిద్దిపేట అర్బన్, జూలై 15: డంపింగ్‌యార్డులో నాటిన మొక్కలను సంరక్షించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అధికారులకు సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యతో కలిసి సోమవారం ఆయన డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ హరితహారంలో భాగంగా చెట్లను, పూల మొక్కలను కాపాడుకునే బాధ్యత మనదేనన్నారు. అనంతరం ఆరవ వార్డులోని సంగుపల్లిలో మురుగు కాలువల సమస్యను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని మునిసిపల్ కమిషనర్, ఏఈలను ఆదేశించారు. ఆయనవెంట కౌన్సిలర్ బబ్బూరి రజిత, మునిసిపల్ కమిషనర్ నరసయ్య ఉన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు సూచించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని 3వ వార్డులో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ వంగ రేణుకాతిరుమల్‌రెడ్డి, శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు శ్రీవిద్య, శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే సిద్దిపేటలోని రంగధాంపల్లి సమీపంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ మంజులారాజనర్సు, వార్డు కౌన్సిలర్ వంగ రేణుకాతిరుమలరెడ్డి మొక్కలు నాటారు.


గజ్వేల్: డంపింగ్‌యార్డులో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన, వ్యక్తిపై కేసు

చేర్యాల, జూలై 15: కొమురవెల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తూప్రాన్‌కు చెందిన ఆకుల శశాంక్ అలియాస్ అభిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు. మల్లన్న దర్శనార్థం ఆదివారం రాత్రి ఆకుల శశాంక్ తదితరులు కొమురవెల్లికి చేరుకుని ప్రైవేటు గదిని అద్దెకు తీసుకుని బసచేశారు. సోమవారం తెల్లవారుజామున సమీపంలోని ఓ మహిళ తమ ఇంటి ఆవరణ శుభ్రం పరుస్తూ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన శశాంక్ అసభ్యకరంగా మాట్లాడటంతో అరుపులు పెట్టింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు చేరుకుని శశాంక్‌ను పట్టుకునే ప్రయత్నం చేయగా, తప్పించుకునేందుకు పరుగెత్తాడు. గొడవ జరుగుతున్న విషయాన్ని గమనించిన కానిస్టేబుల్ లడ్డు నర్సింగరావు గెస్ట్‌హౌజ్ సమీపంలో శశాంక్‌ను పట్టుకుని స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. అనంతరం బాధితులు తెలిపిన వివరాల మేరకు శశాంక్‌పై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి

- తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కోహెడ, జూలై 15: కోహెడ మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ సురేఖకు వినతిపత్రం అందజేశారు. కోహెడ గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ ఉండడంతో ఈ గ్రామంలో ప్రభుత్వ భూమి ఎంత ఉందో గ్రామపంచాయతీకి తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు ప్రభుత్వ భూమి లేకపోవడంతో ఇతర గ్రామాల్లో నిర్మించారని పేర్కొన్నారు. గతంలో మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం లేదని మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఇతర గ్రామాలకు తరలివెళ్లాయన్నారు. ప్రస్తుతం కోహెడకు ఓపెన్ జిమ్, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వీటి నిర్మాణానికి స్థలం చూపెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, బీజేపీ నాయకులు గుగ్గిళ్ల శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, కొండబత్తిని సతీష్, ముంజ సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

సమాచారం

వాటర్‌ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

చేర్యాల, జూలై 15: కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వాటర్‌ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం జీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకుడు తేలు ఇస్తారి మాట్లాడుతూ గ్రామస్థులకు సురక్షిత మంచినీటిని అందించేందుకు జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మూసేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

అంగన్‌వాడీ బాడిబాట

ధూళిమిట్ట: మండలంలోని బైరాన్‌పల్లిలోని అంగన్‌వాడీలో పిల్లలను చేర్పించాలని కోరుతూ 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ స్వరూప మాట్లాడారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా శంకర్‌బాబు

హుస్నాబాద్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన బత్తుల శంకర్‌బాబును నియమిస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సోమవారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్ రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు

ఉపాధ్యాయులకు సన్మానం

చేర్యాల: చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయులు జి.సుజాత, బాలకనకయ్య, నర్సయ్య సావిత్రి ఇటీవల బదిలీ అవడంతో పాఠశాలలో హెచ్ఎం అయిలయ్య, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు.

హెల్త్‌కార్డుల పంపిణీ

సంగారెడ్డి క్రైం: సంగారెడ్డిలోని న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు జారీ చేసిన హెల్త్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులకు పర్మినెంట్ హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు.

బయ్యారం గ్రామానికి దారేది..?

- రైల్వేలైన్, రింగ్‌రోడ్డు నిర్మాణంతో తప్పని ఇబ్బందులు

గజ్వేల్, జూలై 15: గజ్వేల్ మండలం బయ్యారం, బెజుగామ, ఆరేపల్లి(ఎస్‌బీ) గ్రామాలకు వెళ్లే రోడ్డు లేకుండాపోయింది. గజ్వేల్ పట్టణం నుంచి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బయ్యారం గ్రామానికి గతంలో ఉన్న పాత రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. దీంతో గజ్వేల్ నుంచి బయ్యారం చౌరస్తా మీదుగా గ్రామానికి వెళ్లాల్సి వస్తుంది. అదనంగా మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుండడంతో బయ్యారం, బెజుగామ, ఆరేపల్లి(ఎస్‌బీ) గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నేరుగా బయ్యారంకు పాండవుల చెరువు వద్ద నుంచి రోడ్డు ఉండేది. ప్రస్తుతం ఆ రోడ్డులో రైల్వే లైన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరగడంతో రోడ్డంగా ఛిద్రమైంది. రైల్వేలైన్, రింగ్‌రోడ్డు వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ని నిర్మించారు. ఈ ఆర్‌యూబీలో నీరు నిండిపోవడంతో పాటు రోడ్డు సరిగ్గా లేక వాహనదారులు, ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


గజ్వేల్-బయ్యారం రోడ్డు

ఫోర్ లైన్ రోడ్డు వెడల్పును, బ్రిడ్జి పొడవును తగ్గించండి

- మిట్టపల్లిలో భూ బాధితుల నిరసన

సిద్దిపేట అర్బన్, జూలై 15: మిట్టపల్లి గ్రామం మీదుగా నిర్మాణం చేస్తున్న ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులను పాత మార్కు ప్రకారం 100 ఫీట్ల వెడల్పులోనే నిర్మాణం చేయాలని గ్రామానికి చెందిన బాధితులు సోమవారం మిట్టపల్లి గ్రామపంచాయతీ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు సంతోష్, శ్రీనివాస్, మాట్లాడుతూ గతంలో రోడ్డు వెడల్పు 100 ఫీట్లు ఉంటుందని మార్కింగ్ చేసిన అధికారులు... ఇప్పుడు 150 ఫీట్ల వెడల్పు ఉంటుందని మళ్లీ మార్కింగ్ ఛేంజ్ చేస్తున్నారని వాపోయారు. అప్పట్లో అధికారులు ఇచ్చిన 100 ఫీట్ల వెడల్పు మార్కింగ్ ఆదేశాల మేరకే సుమారు 35 నుంచి 45 వరకు ఇళ్లను నిర్మించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం 150 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపడితే నిర్మించుకున్న ఇళ్లతోపాటు ఖాళీగా ఉన్న ప్లాట్స్ కూడా పూర్తిగా నష్టపోతామని అన్నారు. పాత మార్కింగ్ ప్రకారం 100 ఫీట్లకే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా 600 మీటర్లు కాకుండా 300 మీటర్ల వరకే కుదించాలని డిమాండ్ చేశారు.


మిట్టపల్లి గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

వైభవంగా కోటి పార్థివలింగ మహోత్సవం

- హాజరైన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


శివుని ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

దౌల్తాబాద్, జూలై 15: మండల పరిధిలోని దొమ్మాట, గాజులపల్లి గ్రామ దక్షిణ కాశి కైలాసపురంలో నిర్మితమవుతున్న శివుని ఆలయంలో.. చాముండేశ్వరి గురుదత్త పీఠం వ్యవస్థాపకుడు కొడకండ్ల శ్రీరామ్‌చరణ్‌శర్మ గురూజీ ఆధ్వర్యంలో కోటి పార్థివలింగ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు గోపూజ, 8 గంటలకు గణపతిపూజ, 10 గంటల నుంచి 2 గంటల వరకు అరుణాచలేశ్వరస్వామికి వేదపండితులచే అభిషేకం, యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి పార్థివ లింగ మహోత్సవానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.

ఘనంగా స్వాతి నక్షత్ర మహోత్సవం


స్వాతి నక్షత్ర మహోత్సవంలో భాగంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సిద్దిపేట రూరల్, జూలై 15: సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండపై స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి జయంతి నక్షత్రమైన స్వాతి నక్షత్ర మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య అర్చకుడు కలకుంట్ల రంగాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహస్వామి జయంతి నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున ప్రతినెలా బండపై ఉత్సవం జరుపుతున్నట్లు చెప్పారు. స్వయంభూ లక్ష్మీనరసింహస్వామికి శాస్త్రోక్తంగా పంచ కలశ అభిషేకం నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని హోమగుండం వద్ద ఏర్పాటు చేసి సుదర్శన నారసింహ హోమం నిర్వహించామని తెలిపారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచారి, పొడిచేటి శ్రీనివాసాచారి, పొడిచేటి రామకృష్ణాచారి, చైతన్య, పవన్ కుమార్, సాయికృష్ణల నేతృత్వంలో ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం తిరుపతిరెడ్డి, గ్రామ నాయకులు ప్రదీప్‌రావు, రామారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లో నగదు, మద్యం చోరీ

నర్సాపూర్, జూలై 15: నర్సాపూర్‌లో ఓ వైన్స్‌లో జరిగిన చోరీలో రూ.54వేల నగదుతో పాటు 13వేల విలువ చేసే మద్యం అపహరణకు గురైంది. నర్సాపూర్-మెదక్ రోడ్డులో ఉన్న సాయివిక్కి వైన్స్ నిర్వాహకులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి మద్యం దుకాణానికి తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వైన్స్ వెనుక నుంచి దూరి అందులో ఉన్న రూ.54వేల నగదుతో పాటు రూ.13వేల విలువగల మద్యాన్ని అపహరించినట్టు చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

బెజ్జంకి, జూలై 15: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని ముత్తన్నపేటలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేసి ఎల్లంపల్లి మోడల్ స్కూల్‌లో నిర్మించిన కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మప్ప పాల్గొన్నారు.


బెజ్జంకిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

వరి నారు సరిగ్గా మొలకెత్తలేదని రైతుల ఆందోళన

అక్కన్నపేట, జూలై 15: అక్కన్నపేట మండలం పెద్ద తండాలో వరి నారు సరిగ్గా మొలకెత్తలేదని, ఎకరానికి రావాల్సిన నారు అరెకరానికి వస్తుందని రైతుల సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఉన్న ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్ర గ్రామీణ నవనిర్మాణ్ సమితిలో జేజీఎల్-24423 రకం వరి విత్తనాలను 100 ఎకరాలకు కొనుగోలు చేసి తీసుకొచ్చామన్నారు. నారు పోసిన తర్వాత నాటువేస్తే ఒక్క బస్తా విత్తనం ఎకరానికి రావాల్సి ఉండగా.. అరెకరానికి కూడా రాలేదని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రకాశం కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు, స్థానిక మండల వ్యవసాయ అధికారులు నారు ను పరిశీలించారు.


పెద్ద తండాలో వరి నారును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

గురువన్నపేట-సిద్దిపేట బస్సు సర్వీసు పునరుద్ధరణ


గురువన్నపేట నుంచి బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

చేర్యాల, జూలై 15: కొన్నాళ్ల క్రితం అర్థాంతరంగా నిలిపివేసిన గురువన్నపేట-సిద్దిపేట ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సోమవారం నుంచి గతంలో మాదిరిగా బస్సుసేవలు కొనసాగనుండటంతో స్థానికులు హర్షం వెలిబుచ్చుతున్నారు. బస్సు సర్వీసు పునరుద్ధరణ చేయించాలని కోరుతూ కొమురవెల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఇటీవల రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులకు సూచించడంతో సోమవారం సర్వీసు ప్రారంభమైంది.

'నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి'

ములుగు, జూలై 15: రాష్ట్రంలో అల్లాడుతున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని బీఆర్ఎస్ యూత్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జుబేర్ కోరారు. సోమవారం మండల కేంద్రమైన ములుగులో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పక్కనపెట్టడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వర్షాలు లేక అల్లాడుతున్న రైతులను రైతుబంధు విడుదల చేసి ఆదుకోవాలని అన్నారు. ఉద్యోగుల కోసం ధర్నాలు చేస్తున్నవారిపై పోలీసులతో దాడి చేయించడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్

కోహెడ, జూలై 15: నిరుద్యోగులపై ఉక్కుపాదం మోపుతూ రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్వీ విద్యార్థి, వివిధ సంఘాల నాయకుల అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీ, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను పెంచి పరీక్షలను వాయిదా వేయాలని నేడు సచివాలయ ముట్టడిలో భాగంగా రాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్వీ, వివిధ సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి వేధించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుపరచాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ కోసం మరో పోరాటానికి సిద్ధం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజమల్లయ్యమాదిగ

మిరుదొడ్డి, జూలై 15: మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజమల్లయ్యమాదిగ తెలిపారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట వద్ద లక్కీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి జిల్లా, మండలస్థాయి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

'వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలి'

దుబ్బాక, జూలై 15: దుబ్బాక మండలంలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లస్థలాలను కేటాయించాలని దుబ్బాక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాజమల్లు విన్నవించారు. సోమవారం దుబ్బాక జర్నలిస్టులతో కలిసి సిద్దిపేట కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న జర్నలిస్టులకు ఇళ్లస్థలాలను కేటాయించాలని కోరారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, జూలై 15: కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ శివారులోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపి రైతాంగానికి సాగునీటినందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్ ఆధారంగా ఈ ప్రాంతంలోని రైతులు పంటలు పండించుకుంటున్నారని, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోతుండటంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలు కాపాడేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాల పంపింగ్ చేపట్టి ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలకు మళ్లించి సాగునీరు అందించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, రవీందర్, శారద పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తాచాటిన సిద్దిపేట విద్యార్థులు

సిద్దిపేట టౌన్, జూలై 15: రామచంద్రాపురంలోని బీహెచ్ఈఎల్ బాలాజీ గార్డెన్‌లో జరిగిన 13వ ఉమ్మడి మెదక్ జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించినట్లు తైక్వాండో జిల్లా కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ మేరకు క్యాడెట్ విభాగంలో విజయ్ గోల్డ్‌మెడల్, జె.ప్రణవి, సిహెచ్.అమేశ్వర్ సిల్వర్ మెడల్, డి.ఆహ్లాదిక, ఎం.బిందు, ఎం.పునిత్‌రెడ్డి బ్రౌంజ్ మెడల్ సాధించగా, జూనియర్ విభాగంలో పృథ్వీరాజ్ బ్రౌంజ్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను తైక్వాండో జిల్లా గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణశర్మ, తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ పి రామ్మోహన్, డీవైఎస్‌వో నాగేందర్ అభినందించారు.


తైక్వాండోలో పాల్గొన్న విద్యార్థులు

యువతకు మార్గదర్శి రామరాజు: శ్రీరామ భక్త బృందం

సిద్దిపేట టౌన్, జూలై 15: యువతకు మార్గదర్శి రామకోటి రామరాజు అని సిద్దిపేట జిల్లా శ్రీరామ భక్త బృందం సభ్యులు తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని మార్కండేయస్వామి ఆలయంలో గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజుకు భక్తిరత్న జాతీయ పురస్కారం వచ్చిన సందర్భంగా శ్రీరామభక్త బృందం ఆధ్వర్యంలో శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ బృందం ప్రతినిధులు తంగళ్లపల్లి నరేష్, అయిత శ్రీకాంత్, బొల్లం శ్రీనుగౌడ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక


నూతన బీసీ సంక్షేమ సంగం కార్యవర్గం

సిద్దిపేట అర్బన్, జూలై 15: బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంకటి నవీన్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా తొగుట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా భార్గవ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా వల్లపు పవన్, ప్రధాన కార్యదర్శిగా నరేందర్‌గౌడ్, కార్యదర్శిగా తాళ్లపల్లి సురేష్‌లను ఎన్నుకున్నారు.